# పెరనోయిక్ అను బొజ్జారావు కధ

బొజ్జారావు మేధకుడు, మంచివాడు. చిన్నప్పుడు గోళీకాయల ఆటలో అతిసులువుగా వాడిదగ్గర గోళీకాయలు దొంగతనం చేసేవాళ్ళం. వాళ్ళ నాన్న పెద్ద ధనవంతుడేం కాదు. మామూలు కుటుంబం.

"ఒరేయ్ బొజ్జా! పెద్దయ్యాక ఏమవుతావురా? అని అడిగితే

"పోస్టు బంట్రోతునవుతానోయ్" అని వాడి జోక్‌కి వాడే ముందు పకాల్న నవ్వుకొనేవాడు. ఈ కుళ్ళు జోకులు, చచ్చు జోకుల బుద్ధి వాడికి రానురాను పెరిగిందేకాని తగ్గలేదు. ఎప్పుడయినా ఎవరయినా చిన్న మాటంటే ఆరునెలల తర్వాతయినా ఆ మాటకి ఎదురు మాట చెప్పి, గుర్తుచేసి మరీ సాధించేవాడు.

పెద్దయినకొద్దీ వాడికి బొజ్జ పెరగలేదు. పేరులోనే బొజ్జ మిగిలిపోయింది. స్కూల్లో కూడా యిద్దరం కలిసి చదువుకొన్నాం. ఎక్కువ మార్కులు వచ్చేవికావు. మార్కులు రాకపోవడానికి – టీచర్‌కి తన మీదగల కోపాన్నో, పగనో– అతి వింత కథలాగ చెప్పేవాడు బొజ్జారావు. మాకు ఆశ్చర్యం వేసేది.

"ఆ కొంగ మేష్టర్‌కి మా యింట్లో అద్దె పోర్షన్ యిప్పించలేదని కోపం. అదిలేదని చెప్పిన మర్నాడే నాకు ఇంపోజిషన్ యిచ్చాడు. అసలు అంతకు ముందునుంచే నా మీద గొప్ప కోపం వుంది–వాళ్ళ వూళ్ళో పొలాల్ని మా చిన్నాయనగారు వేలానికి తెచ్చారని. ఆ కోపాన్ని నా హిస్టరీ పేపరుమీద తీర్చుకున్నాడు" – ఇలా ఆలోచించేవాడు. తన లోపాలకు కారణాలు వెదకడంలో వాడు చూపే తెలివి తేటలు వాడి చదువుకి ఉపయోగించి వుంటే వాడింకా మంచిమార్కులు కొట్టేవాడని మాకనిపించేది.

కాని వాడిలో ఈ గుణం కనిపెట్టి ఏడిపించేవాళ్ళం. "ఒరే బొజ్జా, నెహ్రూగారు ఢిల్లీ వెళ్ళకుండా హైదరాబాద్ రావడానికి కారణం ఏమిటంటావు?

"ఒరేయ్ మన క్లాసుమేటు మీనాక్షికి మీసాలు రావడానికి కారణం ఏమిటంటావు?"

వాడిని ఏడిపిస్తున్నామని అర్థం చేసుకొనేవాడు కాని ఆ ప్రశ్నలకి సమాధానం చెప్పాలనే ఆసక్తిని మాత్రం చంపుకోలేక పోయేవాడు.

"ఎప్పుడో ఒకప్పుడు 'చౌ ఎన్ లై' ఎదురు దెబ్బ తీస్తాడని నెహ్రూగారి భయం రా. మొన్న టిబెట్ గురించి 'చౌ' మాట్లాడాడుగా. రేపు దండయాత్ర చేస్తాడని బెదిరిపోయాడు. ఎందుకయినా మంచిదని హైదరాబాద్ వచ్చేశాడు."

రహస్యంగా నవ్వుకొనేవాళ్ళం వాడి మాటలు విని. కాని ఈ ఆలోచనలు ఎలాంటి పరిణామాలకి దారితీస్తాయో ఆ రోజుల్లో మాకు తెలిసేది కాదు. అది ఒక జబ్బు. ఆ జబ్బు వాడి జీవితంలోనే తీరని విషాదానికి దారితీస్తుందని మొన్న పేపరు చూసేదాకా నాకనిపించలేదు.

అనిపించేసరికి వేళ మించిపోయింది.

****

బొజ్జారావుకి చిన్న తనంలోనే నాన్న పోయాడు. ఒకడే అన్న. స్కూలుఫైనలు పరీక్షలు రాశాక దూరం మేనత్త యింటికి శలవుల్లో వెళ్ళాడు. తీరా ఊరెళ్ళాక అప్పటికే మంచంపట్టిన తల్లి మరీ ఖాయిలా పడడం, ఆసుపత్రిలో చేర్చాక కేన్సర్ అని తేల్చడం, నాలుగు వారాల తర్వాత బొజ్జారావు తిరిగి వచ్చేసరికి ఆమె చచ్చిపోవడం అన్నీ సినిమా రీలులాగ వరుసగా జరిగిపోయాయి. అన్న బేజారయిపోయాడు. కాని బొజ్జారావు తల్లిపోయిన బాధకంటే అన్న కావాలని తనతల్లి రుగ్మతను తన ముందు దాచాడని భావించాడు. శవాన్ని దహనం చేసి రాగానే అన్నతో పెద్ద తగాదా వేసుకొని వున్నపాటునే యిల్లు వదలి వచ్చేశాడు, చేరిన పెద్దవాళ్ళూ, హితులు పిలుస్తున్నా వినకుండా. ఇది 22 ఏళ్ళ క్రిందట మాట. ఆ తర్వాత వాళ్ళ అన్నయ్య ముఖంచూడలేదు.

బొజ్జారావు చదువు అక్కడితో ఆగిపోయింది. అలాంటి మనస్తత్వం గల మనిషి ఏం పని చేసి రాణిస్తాడా అన్న మీమాంస నాకెప్పుడూ వుండేది. కాని మేమంతా ఆశ్చర్య పడేలాగ మిలటరీలో చేరాడు. వాడి జీవితంలో ఆ దశలోనే సమర్ధనీయంగా బతికాడు. రెండు యుద్ధాల్లో పాల్గొన్నాడు. ఎదుటి వ్యక్తి నేరాన్ని శిక్షించడంలో, లేని నేరాన్ని ఊహించుకోవడంలో వాడికి ఎక్కడ లేని ఉద్రేకం వచ్చేది. సిపాయిగా చేరి, నాయిక్ అయి హవల్దారుగా ప్రమోషన్ కొట్టేశాడు. మిలటరీలో అతనికి మంచిపేరొచ్చింది. వున్నట్టుండి హెర్నియా, టాన్సిల్స్ అడ్డం పెట్టుకుని మిలటరీలోంచి బయటకు వచ్చేశాడు. ఆ రోజుల్లో మళ్ళీ నాకు విశాఖ పట్నంలో తటస్థపడ్డాడు. ఎక్స్ సర్వీసు మన్‌గా రేషన్ షాపులో ఉద్యోగం దొరికింది. క్యూలో నిలబడి బియ్యం కొనుక్కునే వాళ్ళంతా దేశంమీదపడి దోచుకు తినే వాళ్ళుగా అతనికి కనిపించేవారు. ఆ రోజుల్లోనే రేషన్ కార్డు పారేసుకుని అన్నయ్య తిడతాడేమోనని

భయపడే ఒక అమ్మాయికి పొద్దుటినుంచి సాయంకాలందాకా 'టీ'లు తెప్పించి యిచ్చి, ఆమెను ఓదార్చి, కొత్త రేషన్ కార్డుకి అప్లికేషన్ రాయించి ఆ సాయంకాలం వాళ్ళ యింటికి వెళ్ళి ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోదలుచుకున్నట్లు వాళ్ళన్నయ్యతో చెప్పాడు. రేషన్ షాపులో జీవిత భాగస్వామి గురించిన నిర్ణయం ఒక్కరోజులో చెయ్యవచ్చునని ఊహించలేని అన్నయ్య తెల్లబోయి చూశాడు. ఆయన కిరాణా కొట్టులో గుమస్తా. ఏమయినా చిట్టితల్లికి అంతకన్నా మంచి సంబంధం వూహించలేడతను. మిలటరీ నుంచి వచ్చిన యువకుడు. ఇప్పటి వయస్సు 31 అయినా జబర్దస్తీగా వున్నాడు. మాటల్లో అర్థం చేసుకొనే వాడికి చిన్న చమత్కారం కూడా లేకపోలేదు.

"అన్నం తిన్నావా బొజ్జారావ్?"

"ఆ! గడ్డి తినడం చేతకాక"

చిట్టితల్లికి బొజ్జారావు అంటే ఒక సదభిప్రాయం ఏర్పడింది. రేషన్ కార్డును సంపాదించి ఇచ్చి కన్నీళ్ళు తుడిచి టీ తెప్పించే మగాడు జీవితంలో కొంగు బంగారం అవుతాడని ఆమె అనుకొంది. అతి తక్కువ వ్యవధిలో వాళ్ళిద్దరికీ పెళ్ళి అయిపోయింది. ఆ పెళ్ళికి నేను వెళ్ళాను. చిట్టి తల్లి పెద్ద అందంగా వుండదు, అలాగని అందవికారీ కాదు. వయస్సుకు మించిన శరీరం. కాస్త పళ్ళెత్తు. అయినా కళ్ళల్లో చెప్పరాని అందం. ఎప్పుడూ సజీవంగా కనిపిస్తాయి. మెత్తటి మనిషి బొజ్జారావులాగే. ఇద్దరినీ చూడగానే ఎందుకనో అన్యోన్యంగా ఈ జంట బ్రతుకుతారనే నమ్మకం అస్మదీయులకి కలిగింది.

బొజ్జారావు వేరే కాపురం పెట్టాడు. పెళ్ళాన్ని అపురూపమయిన ఆభరణంలాగా చూసుకునే వాడని విన్నాను. చూసుకునే వుండాలి. ఎందుకంటే రెండేళ్ళలో ఇద్దరు పిల్లలు పుట్టారు. మగ పిల్లలు. పిల్లలు తల్లిలాగ అందవికారంగా, తండ్రిలాగ మెత్తగా ఉండేవారు. తన కుటుంబమన్నా, పిల్లలన్నా, సంసారమన్నా అతి దాపరికంగా వుండేవాడు. నోరిప్పి నవ్వకపోతే, బొజ్జారావు నోట్లో ఎన్ని పళ్ళున్నాయో కూడా తెలీదు. వీలయినంత వరకు ఎవరి దగ్గర తన విషయాలు చర్చించేవాడు కాదు.

పెళ్ళి ఒక విధమయిన తృప్తినిచ్చింది కాబోలు. పెళ్ళయిన అయిదారు నెలలకి మెల్లగా ఇంట్లోంచి బయటకు వెళ్ళడం ప్రారంభించాడు. క్లబ్బుకెళ్ళి పేకాట ఆడేవాడు. మిలటరీలో ఉన్న రోజుల్లో కూడా చెయ్యని మరొక పని ప్రారంభించాడు. మందు తాగడం. మనిషిలో స్వేచ్ఛ, ఎక్కువసేపు హాయిగా నవ్వుతూ గడపడం నిజంగా బొజ్జారావులో అందంగా కనిపించింది. మనిషి "ఓపెన్ అప్" అవుతున్నాడని సంతోషించాను.

ఇదిగో! ఈ రోజుల్లోనే హఠాత్తుగా ఒక సంఘటన జరిగింది.

పెళ్ళాన్ని వదిలి వేరేచోట కాపురం పెట్టాడు. అతని జీవితంలో మరో ఆడది లేదు, మీరు బొజ్జారావుని చూస్తే ఉండదని కూడా నమ్ముతారు. అతను చూడడానికి అందంగానే వుంటాడు. కాని మరో అమ్మాయిని ఆకర్షించే శక్తిలేని మనిషి. మరి ఎందుకు పెళ్ళాన్ని వదిలి

వచ్చేశాడు? మాకెవరికీ అర్థం కాలేదు. అన్నగారింటికి వెళ్ళిపోయింది ఆవిడ. బొజ్జారావు పెళ్ళాంమీద చెయ్యి చేసుకోలేదెన్నడూ. కాని ఆమెకి తనపట్ల ప్రేమ లేదని సాధిస్తూ వచ్చాడు. ప్రేమంటే అతని ఉద్దేశ్యం ఏమిటో పెళ్ళానికి వివరించలేదు. ఆమె రెండు పూటలలూ అతనికి వండిపెట్టింది. బట్టలు ఉతికింది. తలకి స్నానం చేయించింది. అతనితో పిల్లల్ని కన్నది. మరేం చెయ్యాలి? లోపం భార్యది కాదు, బొజ్జారావుది. ఎందుకనో వైవాహిక జీవితంమీదా, పెళ్ళాం మీదా వైరాగ్యం ఏర్పడిందతనికి. దెబ్బలాడి పెళ్ళాంతో విడిపోలేదుగాని, విడిపోయాక ఎందరు నచ్చచెప్పబోయినా వాళ్ళతో దెబ్బలాడాడు బొజ్జారావు. ఆ పెళ్ళాం పిల్లలూ నాకక్కరలేదన్నాడు. పిల్లలూ తల్లిలాగే తనంటే అసహ్యించుకొనే బుద్ధి అలవాటు చేసుకొన్నారన్నాడు. అందరం చెప్పి చూశాము. వినిపించుకోలేదు. బొజ్జారావు భార్య చాలా యోగ్యురాలు. ఆమె కూడా చివరికి విసిగిపోయింది. భర్త తన గదిలో పేకాట బృందాన్ని పోగుచేసి మందుకొట్టి సంసారం పట్టకుండా గడుపుతున్నాడని విని గుండెరాయి చేసుకొంది. ఆమె మనస్సు విరిగిపోయింది. ఆఖరికి ఆమె అన్న కంటతడి పెట్టుకొని బావగారి మీద మనోవర్తి దావా వేశాడు. నిర్భయంగా ఏమీ బాధపడకుండా కోర్టుకి వెళ్ళాడు బొజ్జారావు. ఈ వెళ్ళడంలో తన హక్కుల్ని తాను రక్షించుకొంటున్న వీరుడులాగా భావించాడు. యుద్ధంలో అతనికి కలిగిన పట్టుదల లాంటిదేదో కలిగింది. కాని ఏ పొరపొచ్చాలూ లేకుండా ఉన్న కుటుంబం ఉన్నట్టుండి అలా విచ్ఛిన్నం కావడం మాబోటివాళ్ళు సహించలేక పోయాం. ఒకరోజు అతనితో తగాదా పడి తిట్టి నేను ఇంట్లోంచి వచ్చేశాను. తర్వాత బొజ్జారావుతో ఏనాడూ కల్పించుకు మాట్లాడలేదు.

కోర్టులో దావా జరుగుతున్నంత కాలం బొజ్జారావు ఆనందంగానే వున్నాడు. కాస్తంత వౌళ్ళు చేశాడు. ఏమయినా తను వాజ్యం గెలుస్తానని స్నేహితుల్తో కూడా అంటుండేవాడట. కాని అతనితో స్నేహంగా ఉంటున్న వాళ్ళు కూడా అతని భార్యబిడ్డల పట్ల పూర్తి సానుభూతితో ఉండేవారు. ఆవిడే దావా గెలవాలని అంతా ఏకగ్రీవంగా అనుకొనేవాళ్ళు. దీంతో పెద్ద వివాదం పడాల్సిన విషయమేమీ లేదు. అతని ఆలోచన విన్నా ఆమె పట్ల విముఖతకి కోర్టులో కారణమేమీ చూపలేక పోయాడు బొజ్జారావు. ఆశ్చర్యంగా ఆమెని బోనులో నిలబడి కూడా ఏమీ నిందించలేదు. అక్కడ కూడా సంసారానికి సంబంధించిన గుంభన కాపాడుతూ వచ్చాడు. జడ్జిగారే కాస్త ఆశ్చర్యపడ్డాడు.

"నీ పెళ్ళాంతో కాపురం ఎందుకు చెయ్యవు?"

"నాకిష్టం లేక"

"కారణం"

"నాకిష్టం లేకపోవడమే!" అదేదో జోక్‌లాగా, తెలివైన సమాధానంలాగా నవ్వాడు. కాని జడ్జిగారు నవ్వలేదు. మనస్సులో మండిపడ్డారు. ఇతనొక మూర్ఖుడని మనస్సులో రూఢి చేసుకొన్నారు. దావా జరిగిన ఆరు నెలల్లో అలాంటి వాడితో విడిపోయి ఆమె నష్టపోయేదేమీ

లేదని నిర్ణయానికొచ్చారు. కాని నిర్ణయానికి రావలసింది ఆయన కాదు, బొజ్జారావు భార్య. అయితే యిప్పుడిక ఎవరూ ఏం చెయ్యగలిగింది లేదు. నెలకి 150 రూపాయలు భార్యకి, బిడ్డలకి మనోవర్తి యివ్వాలని కోర్టు నిర్ణయించింది. కోర్టు తీర్పు విని బొజ్జారావు మండిపడ్డాడు. జీవితంలో బహుశా మొదటి సారిగా జడ్జిమీదా పెళ్ళాంమీదా కోపం తెచ్చుకున్నాడు. తిట్టాడు. పెళ్ళాన్ని వీధిలో అడుక్కుతినేటట్టు చేస్తానన్నాడు. కాని జడ్జిగారి తీర్పు ప్రకారం నెలనెలా డబ్బు చెల్లించాలి. తప్పదు. ఆమె అన్నగారు రిజిస్ట్రీ ఉత్తరం రాశారు.

ఏ అడ్రసుకి డబ్బు పంపాలో సూచిస్తూ వచ్చిన మొదటికవరు చింపి ఉత్తరం చదివిన తర్వాత ఉత్తరాన్ని చింపిపడేశాడు. చస్తే వాళ్ళకి డబ్బు పంపనన్నాడు. "నీ సంపాదన ఉన్నంతకాలం తప్పదు బొజ్జారావు" అన్నారు మిత్రులు.

"సంపాదన లేకపోతే"

"నువ్వు బతికేదెలా?" ఇదిగో యిక్కడే అతనికి ఆ ఆలోచన మెరుపులాగా తోచింది.

ఆనెల మూడో వారంలో హైదరాబాద్‌లో ఒక మిత్రుడి షష్టిపూర్తికి వెళ్ళాను. ఎండలు ఎక్కువగా వున్నాయి. రైల్లో తిరుగు ప్రయాణం చెయ్యలేక, శక్తి లేకపోయినా ప్లేన్ టిక్కెట్టు కొనుక్కుని మద్రాసు వచ్చేశాను. రెండోరోజున పేపర్లో వార్త పడింది. బొజ్జారావు నేనున్న హొటల్‌లో 203 గదిలో ఆత్మహత్య చేసుకు చచ్చిపోయాడని. నేను 202లో ఉన్నాను. నాలుగు రోజుల ముందే వచ్చేడు. మరో అయిదు రోజుల్లో మనోవర్తి పైకం పంపాలి. రెండో రోజు రాత్రి సుష్టుగా తాగి ఒక సీసా నిద్రమాత్రలు మింగాడు. రెండురోజుల తర్వాత కాని ఎవరూ గ్రహించలేదు. గదిలోంచి వాసన రావడం గమనించి ఎవరో మేనేజరుకి చెప్పారట. తలుపులు బలవంతంగా తెరిచారు. అప్పటికే శవం చెడింది. అంటే నేను హొటల్‌లో ఉన్నప్పుడు నా ప్రక్కగదిలో బొజ్జారావు చచ్చిపడి వున్నాడన్నమాట.

పెళ్ళానికీ, పిల్లలకీ డబ్బు యివ్వకుండా హింసించాలని గట్టి నిర్ణయానికి వచ్చాడు. అతి సులువుగా, తృప్తిగా, గర్వంగా ఆనందంగా తనని చంపుకొని ఆ లక్ష్యాన్ని సాధించాడు.

*(ఆంధ్రజ్యోతి దిన పత్రిక. 8–6–80)*

---